ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట 5

గురువారం 24 ఏప్రిల్ 2025

శంకుస్థాపన చేశారు.. పనులు మరిచారు

- పాలమాకుల ఆరోగ్య ఉపకేంద్రం ప్రహరీ కోసం గత ప్రభుత్వంలో రూ.4 లక్షలు మంజూరు
- శంకుస్థాపన చేసి మూడేళ్లయినా శిలాఫలకానికే పరిమితం
- అధికారుల నిర్లక్ష్యంతో విడుదల కాని నిధులు

8





పహల్గాం మృతులకు నివాళి

కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ బుధవారం రాత్రి చేర్యాలలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. సిద్దిపేట పట్టణంలోని బస్టాండ్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉగ్రవాద సంస్థ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మృతులకు నివాళులర్పించారు.

- సిద్దిపేట కల్చరల్/చేర్యాల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి)

గజ్వేల్ ఎంసీహెచ్ అందుబాటులోకి సేవలు

నూతన భవనంలోనే వైద్య చికిత్సలు

గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ

గజ్వేల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్ పట్టణంలో నూతన మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లోనే ఇకపై మాతా, శిశు సేవలు అందుబాటులో ఉంటాయని గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. ఎంసీహెచ్‌లో ఇన్‌పేషెంట్ సేవలతో పాటు సర్జరీలను, శిశు వైద్య సేవలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ ఇప్పటివరకు నూతన భవనంలో కేవలం ఓపీ సేవలు మాత్రమే అందుబాటులో ఉండేవని, ఇకపై పూర్తిస్థాయి మాతా, శిశు వైద్య సేవలు నూతన ఆసుపత్రిలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. బుధవారం రోజున ఉదయం వేళలోనే ఎంసీహెచ్‌లో ఆరు డెలివరీలను చేశామని పేర్కొన్నారు. నూతన ఆసుపత్రిలో అందుతున్న అదునాతన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక మాతా, శిశు వైద్య సేవలు నూతన భవనంలోకి మారడంతో జిల్లా ఆసుపత్రిలో ఆర్థో, ఈఎన్‌టీతో పాటు ఆయా రకాల వ్యాధులకు సంబంధించిన సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రతి విభాగంలో స్త్రీ, పురుష వార్డులను వేర్వేరుగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆమె వెంట ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జయశ్రీ, వైద్యులు సాయికిరణ్, జ్యోతి, మంజుల తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ

ఘనంగా జగ్గారెడ్డి కూతురు నిశ్చితార్థ వేడుక



జయారెడ్డి, గుణచైతన్యరెడ్డిలను ఆశీర్వదిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



జగ్గారెడ్డితో కలిసి అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి రామ్‌నగర్ బస్తీలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల దంపతుల కూతురు జయారెడ్డి, గుణచైతన్యరెడ్డిల వివాహ నిశ్చితార్థ వేడుక అట్టహాసంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాహుల్‌గాంధీ పీఎస్ బైజు, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ సురేశ్‌శెట్కార్, సీనియర్ కాంగ్రెస్ నేతలు వీహెచ్, కుసుమకుమార్, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, జయవీర్‌రెడ్డి తదితరులు హాజరై కాబోయే దంపతులను ఆశీర్వదించారు.



సంగారెడ్డి రామ్‌మందిర్‌లో పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



మంత్రి కొండా సురేఖ ఆశీర్వాదం



నిశ్చితార్థ వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథ్, అంజన్‌కుమార్‌యాదవ్, కుసుమకుమార్



జిల్లాలో ఉదయం 8 నుంచే ఎండ సుర్రుమనిపించింది. మధ్యాహ్నానికి మాడు పగిలేలా నిప్పుల కుంపటిలా మారింది. రెండు రోజులుగా భగభగమంటున్న వేడితో జనం విలవిలలాడుతుండగా బుధవారం మరింత పెరిగింది. ఏకంగా 43.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అటు ధాన్యం ఆరబెడుతున్న రైతులు, ఇటు విద్యార్థులను ఇళ్లకు తీసుకెళుతున్న తల్లిదండ్రులు, శుభకార్యాలకు వెళుతున్నవారు, వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరియ్యారు. మధ్యాహ్నం వేళ జిల్లాలో ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు

- తొగుట, చేర్యాల, కొహెడ, చిన్నకోడూర్‌లలో 43.3 డిగ్రీలు
- సిద్దిపేట రూరల్ 43.1 డిగ్రీలు
- బెజ్జంకి, నారాయణరావుపేట, మద్దూరు, దుబ్బాకలో 42.9 డిగ్రీలు
- సిద్దిపేట అర్బన్, అక్బర్‌పేట-భూంపల్లిలో 42.6
- కొమురవెల్లి, వర్గల్‌లో 42.5 డిగ్రీలు
- మిరుదొడ్డి, గజ్వేల్‌లో 42.1 డిగ్రీలు
- హుస్నాబాద్‌లో 41.5 డిగ్రీలు

జిల్లాలో వేసవిలోనే గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

మరో రెండు రోజుల పాటు మరింత పెరిగే అవకాశం

పగలంతా వీస్తున్న వడగాల్పులు

జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

రెండ్ అలర్ట్‌కు చేరువగా జిల్లా



సిద్దిపేటలో ఎండలో బస్సుల కోసం ఎదురుచూపులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 23 : మొన్నటి వరకు ఉదయం 10 గంటలకు భానుడు ప్రతాపం చూపెట్టగా, రెండు రోజుల నుంచి 8 గంటల కల్లా ఎండలు దంచికొట్టుతుండటంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది రోజుల నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో 41 డిగ్రీల నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్న క్రమంలో రైతులు, ఉద్యోగులు, చిన్నా, పెద్ద, వృద్ధులు సతమతమవుతున్నారు. వడగాల్పులు, ఉక్కపోతతో విలవిలలాడున్నారు. ద్విచక్రవాహనలపై వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బుధవారం జిల్లాలో ఈ సీజన్‌లోనే రికార్డుస్థాయిలో 43.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వాతవరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేశారు.

నిర్మానుష్యంగా రోడ్లు

జిల్లాలో వాతావరణ అధికారుల అప్రమత్తత ప్రకటించిన నేపథ్యంలో ఎండ ఎక్కువగా ఉంటున్న మధ్యాహ్నం వేళ ప్రజలు అవసరమైతేనే తప్ప బయటకు రావడం లేదు. దినసరి కూలీలు, బంధువుల వద్దకు, శుభకార్యాలకు వెళ్లేందుకు ప్రయాణికులు తప్ప దాదాపుగా ప్రజలు, వాహనదారులు రోడ్లపై కనిపించలేదు. ఏమైనా పనులు ఉంటే ఉదయం తొందరగా ముగించుకుని ఇళ్లకు చేరుకున్నారు. దీంతో నిత్యం బిజీబిజీగా ఉండే పలు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. సాయంత్రం వేళ మళ్లీ బయటకు వచ్చారు. బుధవారం సాయంత్రం 6 అయిన వాతావరణంలో వేడి తగ్గలేదు. రాత్రి కూడా భరించలేనంత ఉక్కపోతగా అనిపించింది.

జిల్లాలో కొన్ని రోజులుగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత కొనసాగుతుండటంతో అధికారులు ఆరెంజ్ అలర్ట్‌ను ఇదివరకే జారీ చేశారు. క్రమేణా పెరుగుతున్న ఉష్ణోగ్రత కారణంగా, మరో రెండు రోజుల పాటు ఎండలు మరింత తీవ్రతరమయ్యే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు తెలిపారు. ప్రస్తుతం రెడ్ అలెర్ట్‌కు చేరువలో ఉన్నది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు దగ్గరకు వెళుతుండడంతో వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



ధరణి దరిద్రమైన చట్టం

దాని ద్వారానే అనేక సమస్యలు వచ్చాయి

నా భూమి కూడా రికార్డుల్లో కనిపించ లేదు

మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ధరణి అనేది దరిద్రమైన చట్టం అని, దాని ద్వారానే చాలా ఇబ్బందులు వచ్చాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ధరణిలో తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరిట మార్చుకుందామంటే రికార్డుల్లో కనిపించలేదన్నారు. కోహెడ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూముల విషయంలో మోసాలకు తావులేకుండా ఉండేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకవచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో 10 వేల మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్లు తిరుపతిరెడ్డి, బోయిని నిర్మల, మంద ధర్మయ్య తదితరులున్నారు.



తలారి చంద్రయ్య ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం

మండల కేంద్రానికి చెందిన సన్నబియ్యం లబ్ధిదారుడు తలారి చంద్రయ్య, మల్లవ్వల ఇంట్లో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి భోజనం చేశారు. ఆ కుటుంబం ఇందిరమ్మ ఇల్లు కావాలని మంత్రిని అడగగా, మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బుధవారం సాయంత్రం మంత్రి కోహెడలో ఏర్పాటు చేసిన దొడ్డి కొంరయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఓ గార్డెన్‌లో జరిగిన కురుమ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు.

భూసమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి

కలెక్టర్ ఎం.మనుచౌదరి

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతిని తీసుకొచ్చిందని కలెక్టర్ ఎం.మను చౌదరి రైతులకు సూచించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ రైతువేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చట్టంలోని వివిధ అంశాలను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్డీవో సదానందం, జడ్పీ సీఈవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాంలో ఉగ్రవాదుల దాడి బాధాకరం : మంత్రి

హుస్నాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడి అత్యంత బాధకరమైనది, దుఃఖ భరితమైనది అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన కోహెడ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. మూడు రోజుల క్రితం తాను ఆ ప్రాంతానికి వెళ్లివచ్చానని, టూరిస్టులు వస్తేనే తమకు ఉపాధి ఉంటుందని అక్కడి ప్రజలు తెలిపారన్నారు. ఇలాంటి దుశ్చర్య వల్ల అక్కడి వారికి ఉపాధి అవకాశాలు దెబ్బతీసినట్లేనని తెలిపారు. 15 రోజుల్లో 15 లక్షల మంది సందరించారని, శాంతి భద్రతల సమస్యల వస్తే అక్కడికి టూరిస్టులు రారన్నారు. కేంద్రం ఎలాంటి సంకోచం లేకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన సంతాపాన్ని తెలిపారు.



సిద్దిపేట బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బడులకు బై బై

వేసవి సెలవులు ఇవ్వడంతో జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలు, కస్తూర్బాలు, గురుకులాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఇళ్లకు బయలుదేరారు. గురుకులాల నుంచి విద్యార్థులు తల్లిదండ్రులతో ఆటోలు, బైక్‌లపై సామగ్రితో సహా తీసుకుని వెళ్లారు. సిదిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం పెద్ద సంఖ్యలో వేచిచూడడం కనిపించింది.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి)



సెల్‌వల్లో పడొద్దు 7

నేటి నుంచి స్కూళ్లకు హాలీడేస్... పిల్లలకు జాలీడేస్

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

శివ్వంపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన సంఘటన బుధవారం శివ్వంపేటలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని శివ్వంపేటకు చెందిన ముద్దగాళ్ల లక్ష్మయ్యకు చెందిన పాడి గేదె పొలం దగ్గర గడ్డిమేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతిచెందింది. గేదె విలువ రూ.50 వేల విలువ ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు లక్ష్మయ్య కోరాడు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

చేగుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనంతో ఢీకొని మహిళ మృతి చెందింది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామానికి చెందిన కమ్మరి మంజుల(45) తన కూతురు అత్త గారు స్వగ్రామం కామారెడ్డి జిల్లా రామారెడ్డికి స్కూటీపై వెళ్లింది. బుధవారం ఉదయం 8 గంటలకు తిరిగి స్వగ్రామానికి వస్తుంది. చేగుంట గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారి సబ్ స్టేషన్ వద్ద ఎలాంటి ఇండికేషన్ ఇవ్వకుండా డ్రైవర్ లారీ నిలపడంతో ఆమె సడన్ బ్రేక్ వేసింది. దీంతో స్కూటీ అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో మంజుల తలకు, కుడి కాలుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కూతురు శృతీలయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.


కమ్మరి మంజుల (ఫైల్)

బైక్ అదుపు తప్పి.. డివైడర్ ఢీకొని..


సంతోష్ మృతదేహం

చేగుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన నార్సింగి మండల పరిధిలోని జప్తిశివనూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి రాత్రి చోటు చేసుకుంది. నార్సింగ్ ఎస్ఐ అహ్మద్ మొనుద్దీన్ వివరాలు ప్రకారం.. సిద్దిపేట జిల్లా భూంపల్లి-అక్బర్‌పేట మండలం చౌదర్‌పల్లికి చెందిన వల్లెపు సంతోష్(28) పెద్దమ్మ కొడుకు పెనుగొండ రాజు కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ గండిమైసమ్మ నుంచి మంగళవారం రాత్రి కామారెడ్డి ఆస్పత్రికి బయలుదేరుతున్నారు. జప్తిశివనూర్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సంతోష్ తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని రామాయంపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి మెడిసిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య శ్రీలత, ఆద్యా(3) ఉన్నది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు..

హవేళిఘణపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న టిప్పర్‌ను ఆటో ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన పోతగల్ల రాములు తన ఆటోలో ప్రయాణికులతో మెదక్ నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. శాలిపేట శివారులో ఐరన్ లోడ్‌తో టిప్పర్ ఆగి ఉన్నది. దగ్గరికి వచ్చేవరకు ఐరన్ కనిపించకపోవడంతో రాములు దగ్గరికి వచ్చాక బ్రేక్ వేసినా.. కంట్రోల్ కాక టిప్పర్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో శాలిపేటకు చెందిన లక్ష్మి(56) అక్కడికక్కడే మృతిచెందింది. రాములుతో పాటు పెంటీ, శ్రీకాంత్‌కు తీవ్ర, బిందు, మల్లికార్జున్, రాములు, పల్లవి, సత్తవ్వకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐని వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


స్వప్న(ఫైల్)

నారాయణఖేడ్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన సంఘటన నారాయణఖేడ్ మండల పరిధిలోని హన్మాన్.జిలో చోటు చేసుకుంది. ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రావుల స్వప్న(30) బుధవారం సాయంత్రం ఇంట్లో దుస్తులు ఉతికి ఇంటి ఆవరణలో పాత టీవీ కేబుల్ తీగపై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. కుటుంబీకులు వెంటనే నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలకు తీసుకు రాగా.. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త రావుల హన్మారెడ్డి, కుమారుడు సాయిచరణ్‌రెడ్డి, కూతురు భార్గవి ఉన్నారన్నారు. స్వప్న మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ సంగన్న వివరాల ప్రకారం కొడుపాక గ్రామానికి చెందిన అవుసుల శ్రీకాంత్(24) స్వర్ణకారుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 21న రాత్రి ఇంట్లో భార్య, తల్లికి మధ్య సంసార విషయంలో చిన్నపాటి గొడవ చోటు చేసుకుంది. ఇద్దరిని ఏమి అనలేక మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఒంటింట్లోకి వెళ్లి అక్కడున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వీధికుక్కల దాడిలో పలువురికి గాయాలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో వీధి పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోజూ ఏదో ఒక వార్డులో పిచ్చికుక్కల దాడిలో పలువురు గాయాలపాలవుతూనే ఉన్నారు. తాజాగా పట్టణంలోని శివాజీ నగర్(4వ వార్డు)లో వీధి కుక్కల దాడిలో పలువురి చేతి, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వీరు స్థానిక జీజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. కాగా సంగారెడ్డిలో వీధి కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు కోళ్లఫాంకు నిప్పు

నంగునూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు పౌల్ట్రీఫామ్ సమీపంలో నిప్పంటుకుని మంటలు చెలరేగడంతో, సకాలంలో మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. నంగునూరు ఎఫ్‌సీఐ గోదాం వెనక పౌల్ట్రీఫామ్‌ను పల్లపు రాజు, కోల ప్రభాకర్‌గౌడ్ లీజ్‌కు తీసుకొని నిర్వహిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఫామ్‌కు సమీపంలో నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న ప్రభాకర్ కోళ్లకు చల్లదనం కోసం రేకుల షెడ్డుపైన ఉన్న డ్రిప్పు పైపులు విప్పి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించాడు. సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలు ఆర్పారు. ఫాంలో ప్రస్తుతం ఆరువేల కోడిపిల్లలు ఉన్నాయి. మంటల వేడికి అవన్నీ ఒక మూలకు చేరాయి.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి కాపర్‌వైర్ చోరీ

రాయపోల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లను దొంగిలించిన సంఘటన రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నీరుడి మల్లమ్మ పొలం సమీపంలో మల్కాపూర్ రోడ్డుపై గల రైల్వే బ్రిడ్జి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పగులగొట్టారు. అనంతరం అందులో ఉన్న ఇత్తడి, రాగి వైర్లు, కాయిల్స్ దొంగిలించారు. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఖననం చేసిన మృతదేహం కుటుంబీకులకు అప్పగింత

హుస్నాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వారంరోజుల క్రితం మండలంలోని జిల్లెలగడ్డ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యం పోలీసులు గుర్తుతెలియని శవంగా కేసు నమోదు చేసుకొని పట్టణంలోని శ్మశానవాటికలో ఖననం చేసిన సంగతి తెలిసిందే. మృతుడు ములుగు జిల్లా వెంకటాపురానికి చెందిన చిడెం సాయిప్రకాశ్ అని పోలీసులు గుర్తించారు. హనుమకొండ జిల్లా చింతగట్టుకు చెందిన బాషబోయిన శ్రీనివాస్ అనే కానిస్టేబుల్ కొంతమందితో కలిసి హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి వద్ద సాయిప్రకాశ్ గొంతుకు ఉరివేసి చంపినట్టు పోలీసులు గుర్తించారు. అనంతరం హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహాన్ని పడవేశాడు. మంగళవారం హత్య వివరాలను వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. దీంతో బుధవారం అధికారుల సమక్షంలో హుస్నాబాద్‌లో ఖననం చేసిన మృతదేహాన్ని బయటకు తీసి మృతుడి కుటుంబీకులకు అప్పగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేశ్, హన్మకొండ పోలీసులు పాల్గొన్నారు.

సెల్‌వల్లో పడొద్దు

నేటి నుంచి స్కూళ్లకు సెలవులు.. పిల్లలకు జాలీడేస్

తగిన జాగ్రత్తలు అవసరం.. సద్వినియోగం చేసుకునేలా చూడాలి

ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీపట్టిన చిన్నారులు ఇక చిచ్చరపిడుగులై చెలరేగిపోతారు. సెలవులు వచ్చాయంటే చాలు రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎక్కడంటే అక్కడే వాలిపోతుంటారు. ఇన్నాళ్లు యూనిఫాంలో బందీలైన వారు ఇప్పుడు మామూలు దుస్తుల్లో మరో లోకంలో తేలియాడుతుంటారు. సెల్‌ఫోన్, టీవీలు చూడడానికి గోల పెడుతుంటారు. మట్టి, మడుగు, చెట్టుచేమల్లో ఆడుతూ, చెరువుల వద్దకు వెళుతూ, ద్విచక్రవాహనాలను నడపాలని తహతహలాడుతూ హంగామా సృష్టిస్తుంటారు. సెలవుల్లో తల్లిదండ్రులు పిల్లలను ఒకకంట కనిపెడుతూ ప్రణాళిక ప్రకారం సద్వినియోగమయ్యేలా చూడాలి..

సిద్దిపేట కల్చరల్/మెదక్ కల్చరల్/కొండపాక, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు వచ్చేశాయి. మళ్లీ జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయితే సెలవులను సరిగ్గా సద్వినియోగం చేసుకోవటం ఎలా..? పిల్లలు మొబైల్ చూడకుండా చేయడం ఎలా? ఎండల నుంచి పిల్లలను కాపాడుకునేదేలా? అంటే తల్లిదండ్రులకు పెద్ద పనే. అయితే, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పిల్లలకు విజ్ఞానం, తల్లిదండ్రులకు ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.


పాఠశాలకు సెలవులు ప్రకటించిన తర్వాత విద్యార్థుల ఉత్సాహం

సెల్‌ఫోన్‌కు దూరంగా..

స్కూల్ నుంచి వచ్చాక కొంచెం గ్యాప్ దొరికితేనే సెల్‌ఫోన్‌లో తలలు పెట్టేస్తారు పిల్లలు. అలాంటిది సెలవులు అంటే వారిని కట్టడి చేయటం కొంచెం కష్టమే. ఇవ్వకపోతే మారం చేస్తారు. దీంతో తప్పక తల్లిదండ్రులు మొబైల్స్ ఇచ్చేస్తుంటారు. ఇదే అసలు ప్రమాదకరం. పిల్లలను వీలైనంతగా సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉంచడం మంచిది. పిల్లలకు పుస్తకాలు చదవటం అలవాటు చేయటం, తల్లిదండ్రులు కూడా ఫోన్ వాడకాన్ని తగ్గించి వారితో గడపడానికి, మాట్లాడటానికి సమయమివ్వాలి. పిల్లలకు కథలను చెప్పే ప్రయత్నం చేయాలి. పెయింటింగ్, డాన్స్, సంగీతం వంటి ఇష్టమైన వాటిల్లో శిక్షణ ఇప్పించాలి. సాయంత్రం పూట స్విమ్మింగ్, లేదా బయటకు తీసుకెళ్లి వారితో సరదాగా గడపాలి. దగ్గరి బంధువుల ఇంటికి పిల్లలను తీసుకెళ్లాలి సరదాగా గడపాలి. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు ఉంటే వారితో ఎక్కువ సమయం గడపాలి. అలాగే గ్రామంలో ఉన్న పెద్దవారితో, వృద్ధులతో కలుపుగోలుగా మాట్లాడుతూ వారు చెప్పే మంచి విషయాలు, కథలు, వారి జీవిత అనుభవాలు పిల్లలు శ్రద్ధగా వినాలి. గ్రామ చరిత్ర, పూర్వీకుల గురించి అడిగి తెలుసుకోవాలి. ఇలా చేయటం వలన పిల్లలతో బాండింగ్ ఏర్పడటంతో పాటు సెల్‌ఫోన్, టీవి చూడకుండా ఉండేలా చేయొచ్చు.



ఎండల తీవ్రత తట్టుకునేలా

వేసవి సెలవులు రావడంతో కొంతమంది పిల్లలు అమ్మమ్మ, నానమ్మ వాళ్ల ఇంటికి వెళతారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు ఇంటికి చేరుకుంటారు. వాతావరణం వేడిగా ఉండడంతో పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరగడం, చెమటతో శరీరంలోని నీరు ఆవిరైపోవడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో పిల్లలు ఇంట్లోనే ఉండేలా చూసుకోవాలి. పెద్దల తోడు లేకుండా పిల్లలను బావులు, చెరువుల వద్దకు ఈత కోసం పంపించవద్దు. బైక్ నడపడానికి ఇవ్వవద్దు. స్నేహితులతో కలిసి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు అనుమతులు ఇవ్వొద్దు. బయట ఆడుకోవడానికి ఉదయం, సాయంత్రం వేళల్లోనే అనుమతించాలి. రెండు పూటలా స్నానం చేయించి, తెల్లని లేతరంగు దుస్తులు వేయాలి.

ఆహార జాగ్రత్తలు

పిల్లలు ఎక్కువగా చిరుతిండ్లను ఇష్టపడతారు. చల్లని పానీయాలు తాగేందుకు అల్లరి చేస్తారు. కూల్‌డ్రింక్‌లు, ఐస్‌క్రీంలు ఎక్కువగా తినిపించడం అంతమంచిది కాదు. ఉదయం ఎండ ఎక్కువ కాకముందే అల్పాహారం అందించాలి. బేకరీ, బయటి పదార్థాలు కాకుండా ఇంట్లోనే అల్పాహారం చేసి అందించాలి. తృణధాన్యాల జావ, మజ్జిగ, పాలను తాగించాలి. నిమ్మరసం, ఖర్జూరాలు ఇస్తే జీర్ణశక్తి పెరుగుతుంది. మధ్యాహ్న భోజనంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారం అందించాలి. ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తగ్గించాలి. ఆకుకూరలు తినిపించాలి. పుచ్చకాయ, దోసకాయ, మజ్జిగ, కొబ్బరి నీరు అందించాలి.


ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

సమ్మర్ క్యాంపులు

అభ్యాసనా అంశాలు మరచిపోకండా జిల్లా విద్యా శాఖ ప్రణాళికలు రూపొందించి నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తుంది. వేసవి సెలవుల్లో సుమారు 10 రోజులపాటు ప్రతి మండలంలో మూడు నుంచి ఐదు ఎంపిక చేసిన పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తుంది. ఈ క్యాంపులో సృజనాత్మకత, చేతిరాతపై నైపుణ్యత, నైతిక విలువలు శ్లోకాలు, చిత్రలేఖనం తదితర అంశాలను విద్యార్థులకు నేర్పిస్తారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వీటిని నిర్వహిస్తారు.

జాగ్రత్తలు పాటించాలి

ఎండలు ఎక్కువగా ఉన్నందున బయట ఆడుకోవడానికి పంపించవద్దు. ఎండ తీవ్రత వలన వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. బయటకు వెళ్తామని పిల్లలు మారం చేయకుండా ఇంట్లోనే చెస్, క్యారం వంటి ఆటలు అలవాటు చేయాలి. ఇంట్లో కూడా వేడిగాలులు రాకుండా చూసుకోవాలి. అలాగే ఇంట్లో చేసిన ఆహార పదార్థాలనే తినిపించాలి. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యుడిని సంప్రదించాలి.

- డాక్టర్ సాయి, పిల్లల వైద్యులు, సిద్దిపేట

పిల్లల మెదడుకు విశ్రాంతి ఇవ్వండి



వేసవి సెలవులు అంటేనే పిల్లల చదువులకు సెలవు. పిల్లల మెదడుకు విశ్రాంతినిచ్చి ఆహ్లాదాన్ని అందించాలి. ప్రత్యేక తరగతులంటూ మానసిక ఆందోళనకు గురి చేయొద్దు. కోచింగ్, సమ్మర్ క్యాంప్‌లు అంటూ ఒత్తిడి పెంచకూడదు. వారికి ఇష్టమైన కళల్లో శిక్షణ ఇప్పించాలి. ఆధ్యాత్మిక, విజ్ఞాన ప్రాంతాలకు తీసుకెళ్లడం వలన వారిలో జనరల్ నాలెడ్జ్ పెరగడమే కాక ఆయా ప్రాంతాల పట్ల అవగాహన కలుగుతుంది. సెలవుల్లో ప్రతీ పాఠశాలల్లో ఎలాంటి తరగతులు నిర్వహించకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.

- గిర్ని అంజాగౌడ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, పాపన్నపేట పాఠశాల

ఎండ వేడిమికి రోగాలెన్నో



ఇన్ని రోజుల నుంచి పాఠశాలలో బంధీగా ఉన్న పిల్లలు ఒక్కసారిగా బయటకు వస్తారు కాబట్టి ఎండలను లెక్కచేయకుండా రెక్కలొచ్చిన పక్షుల్లా ఆడుతుంటారు. దీంతో ఎండ దెబ్బ తగిలి డీహైడ్రేషన్‌కు గురై అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది. ఇదే కాకుండా చల్లటి పానీయాలు, నాసిరకం ఐస్‌క్రీములు లాంటి తిని గొంతు ఇన్ఫెక్షన్, జ్వరం వచ్చే అవకాశాలు ఉంటాయి. వారిని ఒక కంట కనిపెట్టాలి. చెరువులు, చెట్ల దగ్గరకు వెళ్లకుండా చూసుకోవాలి.

- సూఫీ సుజాయత్ అలీ, రష్ హాస్పిటల్, మెదక్

మైనర్‌లకు వాహనాలు ఇవ్వకండి



సెలవుల్లో పిల్లలకు ద్విచక్ర వాహనాలు, కార్లపై ఎక్కువ ఆసక్తి ఉంటుంది. ఇంట్లో వాళ్లకు చెప్పకుండా వాటిని నడిపేందుకు ప్రయత్నించి రోడ్డెక్కి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. వీలైనంత వరకు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తపడాలి. ఒకవేళ మైనర్‌లు వాహనాలు నడిపితే వాహనదారుడిపైన కేసు నమోదు చేయబడుతుంది. చెరువుల వద్ద ఈత సరదాకు ప్రాణాలుపోయిన సంఘటలు చూస్తున్నాం. పెద్దలే దగ్గరుండి పిల్లలను ఈతకు తీసుకెళ్లండి.

- మురళి, సబ్ ఇన్‌స్పెక్టర్, మెదక్ రూరల్

వక్రీకరించి వైరల్ చేసిన ఆడియోపై పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తనను అప్రతిష్ఠపాలు చేసేందుకు ఆడియోను వక్రీకరించి వైరల్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. పేరున్న మీడియా సంస్థలు వక్రీకరించిన తప్పుడు ఆడియోను ప్రసారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గాంధీభవన్‌లో సంజీవరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తాగునీటి సమస్యపై మామిడి మహేష్ ఫోన్ చేస్తే.. జాబ్ గురించి మాట్లాడిన మరో అంశాన్ని దీనికిజోడించి ఆడియో వైరల్ చేస్తున్నారని పేర్కొన్నారు. తప్పుడు ఆడియో సృష్టించి వైరల్ చేయడం వెనుక బీఆర్ఎస్ ఉందని ఆరోపించారు. తనకు ముక్కు సూటిగా మాట్లాడం అలవాటని చెప్పారు. ఆడియో వైరల్ చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సంజీవరెడ్డి తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్, తదితరులు

జహీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రంజోల్ గ్రామంలో రైతువేదికలో ఎరువుల దుకాణాల నిర్వాహకులు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వానాకాలానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించిన రశీదును అందజేయాలన్నారు. రైతులు కూడా ఎరువుల దుకాణాదారుల నుంచి పొందిన రశీదులను పంట కాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలన్నారు. ఆయా దుకాణాల్లో ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా మండలాల వ్యవసాయ అధికారులు ఎరువుల దుకాణాలను తనఖీలు చేసి స్టాక్ వివరాలు సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కాల్షియం కార్బైడ్‌తో పండ్లు మగ్గిస్తే చర్యలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): క్యాల్షియం కార్బైడ్‌తో పండ్లు మగ్గించి విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండ్ల వ్యాపారులందరూ కృత్రిమ పండ్లను కాకుండా సహజ సిద్ధంగా పండించిన వాటినే వినియోగదారులకు విక్రయించి ప్రజల ఆరోగ్యానికి కాపాడాలని ఆమె కోరారు.

వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ఠ


కార్యక్రమంలో తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రామాలయంలో సీతారామచంద్రస్వామి విగ్రహ పునప్రతిష్ఠ మహోత్సవం, ధ్వజస్తంభ ఏర్పాటు బుధవారం వైభవంగా నిర్వహించారు. తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి సీతారామాచంద్ర స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఉదయం నుంచే వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు చేపట్టరు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు గుజ్జరి స్వప్ననకరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోతులే శివుడి విగ్రహాన్ని పడేశాయి

- జిన్నారం ఘటనలో 10 మందిపై కేసులు
- మత విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు
- మల్టీ జోన్ 2 ఐజీ సత్యనారాయణ

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జిన్నారం శివారులో నిర్మాణంలో ఉన్న శివాలయం ఎదుట ఉన్న మట్టి శివుడి విగ్రహాన్ని కోతులు పడేశాయని మల్టీ జోన్ 2ఐజీ వి. సత్యనారాయణ వెల్లడించారు. ఈనెల 22న రాత్రి జిన్నారం మండలంలో జరిగిన ఘటనలపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేశారని చెప్పారు. బుధవారం ఆయన సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. అక్కడి సమీపంలోని సీసీ కెమెరాలన్నీ జల్లెడ పట్టామని తెలిపారు. ఈనెల 19న సాయంత్రం 5.24 గంటలకు శివుడి విగ్రహాన్ని కోతులే పడేయడం వల్ల ధ్వంసమైనట్లు సీసీ కెమెరాల ద్వారా రుజువైందని తెలిపారు. ఈనెల 22న సాయంత్రం జిన్నారం శివారులోని మదర్సా విద్యార్థులు ఆడుకుంటూ శివాలయం వైపు వెళ్లారు. అక్కడ శివుడి విగ్రహం ధ్వంసం అయి ఉండటంతో మదర్సా విద్యార్థులే ఆ పని చేసినట్లు భావించి, వారిని ప్రశ్నించారు. పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా కొంత మంది వ్యక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి మదర్సాలో ఆస్తి నష్టం చేశారు. స్పందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ నేతృత్వంలో పోలీసులు మోహరించి పరిస్థితులను అదుపులోకి వచ్చారని, ఈ ఘటనలో అక్కడి సీసీ కెమెరాలను సమగ్రంగా పరిశీలించామన్నారు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు అక్కడ శివుడి విగ్రహం లేదన్నారు. ఆ విగ్రహం ఏమైందని పరిశీలించగా ఈనెల 19వ తేదీ సాయంత్రం 5.24 గంటలకు కొన్ని కోతులు అక్కడికి వచ్చి శివుడి విగ్రహం వద్ద కొట్లాడుకుంటూ కింద పడేశాయని, దీంతో విగ్రహం ధ్వంసమైందని తెలిపారు. వాస్తవాలను తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేసి ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగిస్తే సహించేది లేదని, అట్టి వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కేసులో పది మంది ఆందోళనకారులపై కేసులు నమోదు చేశామని ఐజీ సత్యనారాయణ తెలిపారు. సంఘటన వీడియోల ఆధారంగా ఎవరైతే ఈ ఘటనకు బాధ్యులుగా తేలుతారో వారిపై కూడా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా, పోస్టులు పెట్టినా చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



జిన్నారంలో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు


చెక్‌పోస్టు వద్ద ఆగిపోయిన వీహెచ్‌పీ నేతలు

నిర్బంధంలో జిన్నారం

- వారం రోజులపాటు సెక్షన్ 163 అమలు
- స్థానికేతరులకు గ్రామంలోకి నో ఎంట్రీ

జిన్నారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం జిన్నారం పోలీసులు దిగ్బంధం చేశారు. స్థానిక శివాలయం వద్ద విగ్రహం ధ్వంసం అనంతరం జరిగిన ఆందోళనతో పోలీసులు అప్రమత్తమై గ్రామానికి నాలుగు వైపుల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు జిన్నారంలో 163సెక్షన్ అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ భిక్షపతి ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామంలోకి ఇతర ప్రాంతాల వారు వస్తే వారిని చెక్‌పోస్టుల వద్ద పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపించారు. స్థానికులు ఆధార్‌కార్డు చూపితేనే వారిని అనుమతించారు. దీంతో జిన్నారం, ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే వందలాది మంది తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ జిన్నారంలోనే మకాం వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వందల సంఖ్యల పోలీసు బలగాలతో చెక్‌పోస్టులు, గ్రామంలో పహారా జరిపారు. వీహెచ్‌పీ, బీజేపీలకు చెందిన జిల్లా, రాష్ట్ర నాయకులు జిన్నారంలోకి రావడానికి ప్రయత్నించగా.. చెక్‌పోస్టుల వద్ద అడ్డుకున్న పోలీసులు వారిని వెనక్కి పంపించారు. దీంతో మండల కేంద్రం నిర్మానుష్యంగా మారింది. శివాలయ దర్శనానికి వెళుతన్న ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఐదు రోజులపాటు కోహీర్ రైల్వే గేటు మూసివేత


కోహీర్ సమీపంలోని రైల్వే గేట్

కోహీర్, ఏప్రిల్ 23: (ఆంధ్రజ్యోతి): కోహీర్ - పోతిరెడ్డిపల్లి మార్గమధ్యలో కోహీర్ సమీపంలోని 23వ నంబర్ రైల్వే గేటును ఐదు రోజుల పాటు మూసివేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. 25వ తేదీ నుంచి 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఈ రైల్వే గేటును అత్యవసర మరమ్మతుల కోసం మూసివేయడం జరుగుతుందన్నారు. అందుకు ప్రయాణికులు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని వెళ్లాలని కోరారు.

ఉపాధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

కౌడిపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేసిన పనుల్లో నాణ్యత తప్పనిసరి అని మెదక్, సిద్దిపేట జిల్లాల క్వాలిటీ కంట్రోల్ అధికారి జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీలో నిర్మాణం చేసిన పశువుల పాకను, రోడ్డు పనులు, ఉపాధి కూలీల పనుల వద్దకెళ్లి మాట్లాడారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి కూలీకి రూ.300 వచ్చేవిధంగా కొలతలు ఇస్తూ పనిచేయించాలని సూచించారు.

కు.ని.తో కుక్కల సమస్యకు చెక్

- జిల్లా కేంద్రంలో అందుబాటులోకి వచ్చిన ఏబీసీ
- మూడు నెలలుగా వెయ్యికి పైగా ఆపరేషన్లు
- ఒక్కో ఆపరేషన్‌కు రూ.1650 చెల్లిస్తున్న మున్సిపాలిటీ
- శునకాల పెరుగుదలకు అడ్డుకట్ట

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుక్కల సంతతి పెరగకుండా ఉండేందుకు జిల్లా కేంద్రంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా కేంద్రంతోపాటు నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీల పరిధిలోని వీధి శునకాలకు ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయనున్నారు. దుబ్బతోట శివారు ఎకరా స్థలంలో రూ. 84 లక్షలతో ఏబీసీ కేంద్రానికి భవనం ఏర్పాటు చేశారు. ఇందులో 18 కెనల్స్‌తో పాటు 20 బోన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుందుకు ఆపరేషన్ థియేటర్‌లో అన్ని వసతులను ఏర్పాటు చేశారు. ఒక డాక్టర్, ఒక అసిస్టెంట్, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు. రోజూ ఒక ఆటోలో వెళ్లి వార్డుల వారీగా 20కి పైగా కుక్కలను పట్టి తీసుకెళ్తున్నారు. తెచ్చిన వాటిని బోన్‌లో ఒక రోజు ఉంచి పర్యవేక్షిస్తారు. ఆరోగ్య పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఆపరేషన్‌కు తీసుకెళ్తారు. అనంతరం పోస్ట్ ఆపరేటివ్‌లో భాగంగా బోన్లలో ఉంచి తిరిగి పర్యవేక్షిస్తారు. శునకానికి కుట్లుమాని సాధారణ స్థితికి వచ్చాక ఎక్కడి నుండి పట్టుకొచ్చారో అక్కడే వదిలేస్తారు. పట్టినప్పటినుండి వాటిని వదిలేసేంత వరకు ఆపరేషన్‌తో కలిసి ఒక్క కుక్కకు రూ.1,650ను మున్సిపాలిటీ సదరు నవోదయ స్వచ్ఛంద సంస్థకు చెల్లిస్తుంది. కుక్కలతో పాటు పశువులకు కూడా ఇక్కడే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. గేదెలు, ఆవులే కాకుండా పట్టణంలో ఇష్టానుసారంగా సంచరించే ఇతర జంతువులకు కూడా ఆపరేషన్ చేసే సదుపాయాన్ని కల్పించారు. త్వరలో ఈ పశువుల కేంద్రం సైతం అందుబాటులోకి రానుంది. పట్టణాల్లోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల నుంచి కుక్కలను తెచ్చి ఆపరేషన్ చేసే అవకాశం ఉంది. గ్రామాలలోని కుక్కలకు ఆపరేషన్లు చేస్తే పంచాయతీ వారే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.


శస్త్ర చికిత్సలు చేస్తున్న వైద్యులు

శునకాల జనన నియంత్రణ కోసం..

సాధారణంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ చేసేకంటే ముందు ఉండే కోపం చికిత్స అనంతరం తగ్గుతుంది. దీంతో మనుషులపై దాడిచేసే గుణాలు తగ్గుముఖం పడతాయి. ఈ చికిత్స ద్వారా కుక్కలను చంపకుండా వాటి జనన నియంత్రణను తగ్గించవచ్చు. జిల్లా వ్యాప్తంగా వంద శాతం ఆపరేషన్లు పూర్తి చేస్తే ఎక్కడికక్కడ కుక్కల పెరుగుదలకు అడ్డుకట్ట వేసినట్లవుతుంది.

కుక్కల సంతతి పెరగకుండా చర్యలు...

కుక్కల సంతతి పెరగకుండా ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఉపయోగపడుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి మాసంలో ఏబీసీని ప్రారంభించామని, ఇప్పటి వరకు 1000కి పైగా కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసినట్లు చెప్పారు. ఈ విధానంతో వాటి సంతానం పెరగకుండా నియంత్రించవచ్చని వివరించారు. త్వరలోనే అన్ని ప్రాంతాల శునకాలకూ శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు.


పశువుల కోసం నిర్మించిన కేంద్రం


ఆపరేషన్‌కు ముందు కెనల్స్‌లో ఉంచిన కుక్కలు


వీధుల్లో ఉన్న కుక్కలను పట్టుకొస్తున్న సిబ్బంది

సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

మర్కుక్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వెంకట్‌రాములు తెలిపారు. పాఠశాల చివరి దినం రోజున మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ రాములుగౌడ్‌తో హాజరైన మండల విద్యాధికారి వెంకట్‌రాములు మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీ వరకు పాఠశాలలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో విద్యార్థులు స్టోరీ టెల్లింగ్, డ్రాయింగ్, గేమ్స్, డాన్స్ స్కిల్స్, యోగ మెడిటేషన్ మొదలైన అంశాల పట్ల మెలుకువలు నేర్పిస్తారని వివరించారు.

● మద్దూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి మే 5 వరకు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వరదరాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రేబర్తి ఉన్నత పాఠశాల, గాగిళ్లాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారని వివరించారు.

● చేర్యాల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలం ముస్త్యాల మోడల్‌స్కూల్ గ్రౌండ్‌లో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15ఏళ్ల వయసున్న బాలబాలికలకు మే-1వ తేదీ నుంచి నెలరోజులపాటు హ్యాండ్‌బాల్ ఉచిత శిక్షణా శిబిరం ఏర్పాటుచేసినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 8520846153, 9989697473 సెల్‌నంబర్లకు కాల్‌చేసి సంప్రదించాలని కోరారు.

రేపు బీఎస్ఎన్ఎల్ సేవా మేళా

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న సిద్దిపేటలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల కోసం సేవామేళా నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ ఏజీఎం లక్ష్మణ్ బానోత్ వెల్లడించారు. సిద్దిపేటలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఉత్తర ద్వారం వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గం.ల వరకు మేళా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సిద్దిపేట జిల్లాలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌డీఈలు పెంజర్ల మోహన్ రెడ్డి, చిట్టిపాక రవీందర్ సూచించారు.

సమస్యలపై రాజీలేని పోరాటాలే సీపీఐ లక్ష్యం

అక్కన్నపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లక్ష్యమని మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని కుందనవానిపల్లిలోలో సీపీఐ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లను ఇల్లు లేని నిరుపేదలకు మంజూరు చేయాలని కోరారు. అన్యాయం జరిగితే వారి పక్షాన సీపీఐ పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ గ్రామ కార్యదర్శిగా బొల్లం రమేష్, సహాయ కార్యదర్శిగా వేల్పుల సంపత్ ఎన్నికయ్యారు.

తొగుటలో ఇందిరమ్మ మోడల్ హౌస్

తొగుట,ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ఇందిరమ్మ మోడల్ హౌస్ భవనానికి హౌసింగ్ డీఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్లాబ్ వేయించారు. ఈ భవనాన్ని రూ.5 లక్షలలో నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా ఇదే విధంగా గ్రామాల్లో నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ఉగ్రవాదులను మట్టుబెట్టాలి

చేర్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను మట్టుబెట్టాలని కాంగ్రెస్‌పార్టీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

బీజేపీలో చేరిక

చేర్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలకేంద్రానికి చెందిన భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ ఎక్కలదేవి శ్రీనివాస్ బుధవారం బీజేపీలో చేరారు.జనగామ జిల్లా అధ్యక్షుడు రమేశ్ చేతులమీదుగా క్రియాశీల సభ్యత్వం పొందారు.

శంకుస్థాపన చేశారు.. పనులు మరిచారు




సబ్ సెంటర్ ఆవరణలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్, మూడేళ్ల క్రితం ప్రహరీ కోసం వేసిన శిలాఫలకం

- పాలమాకుల ఆరోగ్య ఉపకేంద్రం ప్రహరీ కోసం గత ప్రభుత్వంలో రూ.4 లక్షలు మంజూరు
- శంకుస్థాపన చేసి మూడేళ్లయినా శిలాఫలకానికే పరిమితమైన పనులు
- అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో విడుదల కాని నిధులు
- ప్రైవేట్ వాహనాలకు, పోకిరీలకు అడ్డాగా సబ్‌సెంటర్ ఆవరణ

నంగునూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేద ప్రజలకు వైద్యం అందించాలనే లక్ష్యంతో గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి కాంపౌండ్ లేకపోవడంతో ప్రైవేట్ వాహనదారులకు అడ్డాగా మారి రోగులకు ఇబ్బందిగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. నంగునూరు మండలం పాలమాకుల ఆరోగ్య ఉపకేంద్రానికి ప్రహరీ నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.4 లక్షల నిధులు మంజూరు కాగా, ఆగస్టు 2022లో శంకుస్థాపన సైతం చేశారు. శంకుస్థాపన చేసి మూడేళ్లు కావస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో పనులు శిలాఫలకానికే పరిమితమయ్యాయని గ్రామస్థులు చెబుతున్నారు.

పోకిరీలకు అడ్డాగా..

అప్పట్లో స్థానిక ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ ప్రహరీ నిర్మాణం పనుల పట్ల దృష్టి సారించకపోవడం వల్లే నిధులు విడుదల కాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణ ప్రైవేట్ వాహనాలవారికి అడ్డాగా మారింది. అదేవిధంగా సాయంత్రం వేళల్లో పోకిరీలు మద్యం తాగుతూ, పాన్ పరాగ్‌లు తింటూ ఉమ్మేయడంతో ఆవరణ మొత్తం అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నది. దీంతో వివిధ ఆరోగ్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులు, బాలింతలు, ఇతర వ్యాధిగ్రస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సబ్ సెంటర్‌కు ప్రహరీ లేకపోవడంతో పశువులు, మేకలు, కోతులు ఆవరణలో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు

ముదిరాజ్‌ల ముప్పై ఏళ్ల కల సాకారం




గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు, చెరువులో చేపలు పడుతున్న ముదిరాజ్‌లు

- ఖాజీపూర్ పోలీసు బలగాల మోహరింపు
- చెరువులో చేపలు పట్టేందుకు గ్రామస్థులతో కుదిరిన సఖ్యత

మిరుదొడ్డి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గత మూడు దశాబ్దాలుగా చెరువులో చేపలు పట్టే విషయంలో జరుగుతున్న గొడవ హైకోర్టు తీర్పు, అధికారుల చొరవతో సద్దుమనిగింది. చెరువులో చేపలు పట్టే విషయంలో అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామస్థులకు, ముదిరాజ్ కులస్థులకు మధ్య తీవ్రస్థాయిలో గొడవలు జరుగుతున్నాయి. గ్రామంలోని చెరువుపై హక్కు గ్రామస్థులకే ఉంటుందని, తద్వారా గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని గ్రామస్థులు చెబుతూ ముదిరాజులను చేపలు పట్టకుండా గ్రామస్థులు అడ్డుకున్నారు. ముదిరాజ్ కులస్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ముదిరాజ్‌లకు అనుకూలంగా తీర్పునిచ్చింది. బుధవారం సిద్దిపేట ఏసీపీ మధుతోపాటు మరో ముగ్గురు ఏసీపీలు, ఆరుగురు సీఐలు, 20మంది ఎస్ఐలు, 100మంది పోలీసులు గ్రామంలో మోహరించగా, ముదిరాజ్‌లు చేపలు పట్టడానికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అదేసమయంలో గ్రామస్థులు అడ్డుకోవాలని తీర్మానం చేసుకున్నారు. దీంతో గ్రామస్థులు, ముదిరాజ్ కులస్థులు సామరస్యంగా మాట్లాడుకోవాలని గ్రామసభను ఏర్పాటు చేశారు. ఏసీపీ మధు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించుకోవాలని ఇరువర్గాలవారికి సమయం ఇచ్చారు. గ్రామంలోని పెద్దలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ముదిరాజ్‌లు చర్చించుకుని చివరికి ఓ అంగీకారానికి వచ్చారు. చెరువుపై వచ్చే ఆదాయంలో 60శాతం గ్రామానికి, 40 శాతం ముదిరాజ్‌లకు చెందేలా నిర్ణయించుకున్నారు. అనంతరం పోలీసుల సమక్షంలో ముదిరాజ్‌లు చెరువు వద్దకు చేపలు పట్టుకున్నారు. కొన్నేళ్ల సమస్య ఎట్టకేలకు సద్దుమనగడంతో పోలీసులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

రాంసాగర్‌లో ఘనంగా సీతారాముల రథోత్సవం



రాయపోల్ మండలం రాంసాగర్‌లో సీతారాముల రథోత్సవం

రాయపోల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంసాగర్ గ్రామంలో జరుగుతున్న రామాలయ వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. మంగళవారం సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించగా, బుధవారం సీతారాముల రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామ వీధుల్లో రథాన్ని లాగారు. ఈ సందర్భంగా పెద్దమ్మతల్లికి బోనం సమర్పించి, మహాబలి, పూర్ణాహుతి జరిపారు. సాయంత్రం పోచమ్మ, ఎల్లమ్మదేవతలకు బోనాలు నివేదించారు. ఆ దూరప్రాంతాల లోనుండి కుటుంబసభ్యులు పండుగ సందర్భంగా తరలిరావడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

గ్రామదేవతల బోనాలు



తపాస్‌పల్లిలో బోనాలతో మహిళల ఊరేగింపు

చేర్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామంలో ముదిరాజ్‌కులసంఘం ఆధ్వర్యంలో గ్రామదేవతల బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు.

వంటావార్పుతో డాక్యుమెంట్ రైటర్ల నిరసన

చేర్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్‌లలో స్లాట్‌విధానం రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ చేర్యాల సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో డాక్యుమెంట్ రైటర్లు బుధవారం వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. స్లాట్ విధానంతో ఎలాంటి ప్రయోజనం లేదని, వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..

గజ్వేల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి కుటుంబాన్ని చిన్ననాటి మిత్రులు తమ వంతుగా సహాయాన్ని అందజేశారు. మండలంలోని శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన పాండవుల శ్రీనివాస్ ఇటీవల పొలం వద్ద పాము కాటుకు గురై మృతిచెందాడు. దీంతో తోటి స్నేహితులు తలా కొంత డబ్బు వేసుకుని మొత్తం రూ. 16,500 నగదును బాధిత కుటుంబానికి అందజేశారు.

ఒత్తిడిని జయించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఉమాపతి

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పరీక్షలనగానే విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతారని, అలా కాకుండా ఒత్తిడిని జయించాలని వ్యక్తిత్వ వికాసనిపుణుడు ఉమాపతి సూచించారు. సిద్దిపేటలో ఏబీవీపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ బోధన తరగతులకు ఉమాపతి హాజరై మానసిక ఒత్తిడిని తట్టుకోవడానికి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య, నగర కార్యదర్శి పరుశరాం, కన్వీనర్ అనీష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తన ఉచిత శిక్షణ శిబిరం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): శ్రీఅన్నమాచార్య సాంస్కృతిక సంస్థ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉచితంగా అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు అన్నమయ్య పవన్ నేతృత్వంలో ఈ నెల 25 నుంచి మే 6వ తేదీ వరకు ఈ శిబిరం కొనసాగనున్నట్టు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని కమాన్ సమీపంలోని సుందర సత్సంగ భవనంలో సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు తరగతులు ఉంటాయని సంస్థ సంచాలకులు హరిణి పవన్ తెలిపారు. ఆసక్తిగల్గిన బాల బాలికలు, యువతి యువకులు, పెద్దవారు అందరూ పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 986695051 ఫోన్ నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఆలయానికి మాజీ జడ్పీటీసీ విరాళం

మర్కుక్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరదరాజ స్వామి ఆలయాన్ని దాతల సహాయంతో పునర్నిర్మాణం చేస్తున్నారు. ఈ సందర్భంగా మర్కుక్ మండల మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం తనవంతుగా రూ.51,111 విరాళాన్ని అందించారు. ఈ నగదును దేవాలయ అర్చకులకు స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, రామచంద్రంను అభినందించి శాలువాతో సత్కరించారు.

ప్రజ్ఞాపూర్‌లో ఉగ్రదాడి మృతుల ఆత్మశాంతికి కొవ్వొత్తులతో ర్యాలీ



అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో మరణించిన పౌరుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ బుధవారం ప్రజ్ఞాపూర్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాద దాడిని వారు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, సాగర్, ఉప్పలయ్య, మహేందర్, యాదగిరి, శివకుమార్, రమేష్, శ్రీనివాస్, విజయ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ షాపుల వేలానికి స్పందన కరువు

మిరుదొడ్డి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ దుకాణ సముదాయాలకు బుధవారం స్థానిక కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ వేలంపాటకు స్పందన కరువైంది. పోచమ్మ గుడివద్ద గడువు ముగిసిన 5 దుకాణాలకు, లాల్‌బహదూర్‌శాస్త్రి విగ్రహం వద్ద మొదటి అంతస్తులోని6 షటర్లకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లవద్ద 4నాలుగు షటర్లకు వేలాన్ని నిర్వహించారు. పోచమ్మగుడి వద్ద 3, లాల్‌బహదూర్‌శాస్త్రి విగ్రహం వద్ద 9,19,11,12,13, డబుల్‌బెడ్‌రూం 1,5,7,8 షటర్లకు ఎలాంటి దరఖాస్తులు రాలేదన్నారు.

అధిక పాల సేకరణ లక్ష్యంగా మిల్క్ సెంటర్లు



మిల్క్ సెంటర్‌ను పరిశీలిస్తున్న బెంగళూరు కృషి కల్ప ఫౌండేషన్ సభ్యులు

ములుగు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అధిక పాల సేకరణే లక్ష్యంగా మండల సమాఖ్యల ఆధ్వర్యంలో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఆర్డీవో జయదేవ్ ఆర్య తెలిపారు. ములుగు మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాల శీతలీకరణ కేంద్రాన్ని బుధవారం బెంగళూరుకు చెందిన కృషి కల్ప ఫౌండేషన్ బృందం సభ్యులు పరిశీలించారు. వారికి డీఆర్డీవో జయదేవ్ ఆర్య సమాఖ్య ద్వారా నిర్వహిస్తున్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ నిర్వహణ, పాటిస్తున్న ప్రమాణాలు, పాల సేకరణ, శీతలీకరణ, మిల్క్ బిల్లింగ్, విజయ డెయిరీ, మండల సమాఖ్య అందిస్తున్న సేవల గురించి వివరించారు. అలాగే పాల ఉప ఉత్పత్తుల లోకల్ సేల్స్, అమ్మకం, ఆన్లైన్ బిల్లింగ్ విధానాన్ని పరిశీలించాలని బృందం మండల సమాఖ్యకు సూచించారు. కార్యక్రమంలో డిపిఎం వాసుదేవ్, ఏటీఎం యాదగిరి, సీసీలు రాజలింగం, భాస్కర్, నర్సింలు, ఉమ, మండల సమాఖ్య అధ్యక్ష కోశాధికారులు భాగ్యలక్ష్మి, సరస్వతి, బీఎంసీయూ సిబ్బంది మహేందర్, రజిత, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై అప్పీల్ చేసుకునే అవకాశం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

బెజ్జంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్‌లపై భూభారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు. బుధవారం బెజ్జంకి మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతుల సందేహాలను నివృతి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చన్నారు. అంతకు ముందు భూ భారతి చట్టంలోని పలు అంశాలను రైతులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే మేథో సంపత్తి



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్, అధ్యాపకులు

గజ్వేల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో మానవ మేధాశక్తి వికాసం చెందుతుందని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానామస్) ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ పేర్కొన్నారు. గజ్వేల్ బాలురహబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానామస్)లో లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక, కాపీరైట్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించి ప్రసంగించారు. పుస్తక పఠనంతోనే విద్యార్థులలో పరిపూర్ణ వ్యక్తిత్వం పెంపొందుతుందన్నారు రచయిత డాక్టర్ రాజిరెడ్డి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలని చదవడం వలన ఎన్నో గొప్ప విషయాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన విద్యార్థులను, అధ్యాపకులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో వారితో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. గణపతిరావు, డాక్టర్ మహేందర్‌రెడ్డి, గ్రంథాలయాధికారి వి. వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దు: సీఐ

తొగుట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి ఇతరుల మరణానికి కారణం కావద్దని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. బుధవారం తొగుటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు రాత్రి సమయాల్లో గమనించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం ఆరబెట్టుకోవాలని సూచించారు. రోడ్లపై ధాన్యం పోయవద్దని సూచించారు.

పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసరి



గ్రాడ్యుయేషన్ డే లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సిబ్బంది, టీచర్లు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారమే ముఖ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న సూచించారు. బుధవారం సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి స్వప్న హాజరై మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తద్వారా వారికి పౌష్టికాహారం అందుతుందన్నారు. గర్భం దాల్చిన ప్రతీ మహిళ అందుబాటులోని అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. పోషణ పక్వాడ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్వేత, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, జ్యోతి, యమున, ఆశ వర్కర్ మాధవి, ఆయాలు సుగుణ, ఆదిలక్ష్మి, రేణుక, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

నంగునూరు/చేర్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య పిలుపునిచ్చారు. బుధవారం నంగునూరు మండలం పాలమాకులలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారం కోసం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో మాజీ సర్పంచులు ఎల్లంకి రవీందర్ రెడ్డి,పంగ కుమార్, మాజీ ఎంపీటీసీ శివశంకర్, వెంకట్, వేల్పుల ఐలయ్య, ఓజాల్, సంపత్ తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ కొమురవెల్లి మండల నాయకుడు ఏర్పుల మహేశ్, మాజీ ఉపసర్పంచు కొండా శ్రీధర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ హయాంలో దేశానికి ఆదర్శంగా నిలిచిన రాష్ట్రం కాంగ్రెస్ 15నెలల పాలనలో అధోగతిపాలైందన్నారు. సమావేశంలో నాయకులు గౌటె రవి, గజ్జె వెంకటేశ్, ముక్కు విరాట్ బాబు, మహేందర్ యాదవ్, లింగంపల్లి అజయ్, మ్యాకల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం




దుద్దెడ పాఠశాలలో విద్యార్థులకు ఉత్తీర్ణత పత్రాలు అందజేస్తున్న డీఈవో, హుస్నాబాద్ కళాశాలలో విద్యార్థినుల ప్రదర్శన

కొండపాక/రాయపోల్/మిరుదొడ్డి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైందని జిల్లా విద్యాధికారి ఈ. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండపాక మండలం దుద్దెడ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. పాఠశాల ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి అభినందించారు. పాఠశాలలో ఆయా తరగతుల్లో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉత్తీర్ణత ధ్రువపత్రాలను డీఈవో అందజేశారు. పాఠశాల ఆవరణలో డయాస్ కోసం రూ. 2 లక్షలను విరాళంగా ప్రకటించిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు ఎం.కిరణ్మయిని, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. సమావేశానికి హాజరైన పలువురు తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. నాటక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరెడ్డి, కమ్యూనిటీ మొబిలైజర్ ఆఫీసర్ పి. రంగనాథస్వామి, హాస్టల్ వార్డెన్ పి.రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. రాయపోల్ జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవకార్యక్రమంలో డీఈవో పాల్గొని మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు రాళ్లబండి పెంటాచారి, ఎంఈవో సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లిలోని చార్వాక మోడల్ స్కూల్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కుమార్, మాజీ ఎంపీడీవో బాలమల్లేశంలు మాట్లాడుతూ.. విద్యార్థుల చదువుపై తల్లితండ్రులు దృష్టిని పెట్టాలన్నారు.

● హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చివరి సంవత్సరం విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి మాట్లాడుతూ మూడేళ్లపాటు విద్యార్థులకు కళాశాలతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదిగి సమాజ సేవ చేయడానికి ముందుకు రావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.